సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. నరసింహనగర్, చంద్రనగర్, ఎల్లపువాని పాలెం ఫీడర్ల పరిధిలో సూర్యనగర్, సంతోష్‌నగర్, బాజీ జంక్షన్, రెడ్డివీధి, సుసర్ల కాలనీ, జయప్రకాష్‌నగర్, ఎస్సీ కాలనీ, విద్యానగర్, రవీంద్రనగర్, రైల్వే స్టేషన్ నాయుడు క్వార్టర్స్, చంద్రనగర్, గణేష్ నగర్, ఖర్వేల్ నగర్, తుంపాలవీధి తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

'బీసీలు రాజకీయాల్లోకి రావాలి'



మాట్లాడుతున్న పార్టీ నేషనల్ కో ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు

సీతంపేట: బీసీలందరూ రాజకీయాల్లోకి రావాలని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ నేషనల్ కో ఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ జె.పూర్ణచంద్రరావు ఆకాంక్షించారు. డైమండ్ పార్క్ సమీపంలో బుధవారం నూతనంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు బీసీల హక్కులు, సాధన కోసం మారాల్సిన అవసరం ఉందన్నారు. ఒక పార్టీ జెండా పట్టుకుంటే ఎప్పటికీ వెనకే ఉండిపోతామన్నారు. ముస్లిం బీసీల సమస్యలను మనమే ఎజెండాగా ఎంచుకుని మాట్లాడటం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేసిన వారమవుతామని చెప్పారు. నలుపు రంగు చొక్కా నిరసన ద్వారా మన భావజాలాన్ని, మన సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీల సమస్యలను మనమే గొంతెత్తి చెప్పేలా ఏఐ బీస్పీ ముందు పోరాడుతుందని తెలిపారు. మన సమస్యలను మనమే పరిష్కరించుకునేందుకు సన్నద్ధం కావాలన్నారు. సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం పెరియార్ మార్గంలో పయనించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ కె.లక్ష్మి, రాష్ట్ర నాయకులు వై.శారద, ముస్లిం నాయకుడు అబ్దుల్ మనస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవి క్రియేషన్స్ చిత్రం షూటింగ్ ప్రారంభం



క్లాప్ కొడుతున్న నటుడు పైడిరాజు నూనెల

మల్కాపురం: అలేఖ్య బ్యానర్‌పై మురళీకృష్ణ దర్శకత్వంలో దేవి క్రియేషన్స్ నిర్మిస్తున్న తొలి చిత్రం షూటింగ్ బుధవారం జరిగింది. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన సినీ నటుడు పైడిరాజు నూనెల ఈ చిత్రానికి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ముహూర్తపు షాట్‌ను స్థానికంగా ఉన్న దేవాలయంలో చిత్రీకరించారు. చిత్రంలో ఉలిశెట్టి శ్రీనివాస్ హీరోగా, అను హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ అరకు చుట్టుపక్కల ప్రదేశాలలో జరుపుతామని యూనిట్ సభ్యులు తెలిపారు.

బోరు పనిచేయక అవస్థలు



గొల్లకంచరపాలెంలో నీరు రాని బోరు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో మంచినీటి బోరు సక్రమంగా పనిచేయక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మంచినీటి కుళాయిలు రాని సమయంలో ఈ బోరు ఎంతగానో ఉపయోగపడేదని తెలిపారు. సుమారు 40 ఏళ్ల క్రితం ఇక్కడ ఈ బోరును ఏర్పాటు చేశారు. ఒక్కోసారి పని చేయకపోయినా, బురదనీరు వస్తున్నా స్థానికులు సర్దుకుపోతున్నారు. సిబ్బందికి దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. సమస్య శాశ్వత పరిష్కారానికి అదే చోట కొత్త బోరును నిర్మించాలని కార్పొరేటర్‌కు వినతులు అందించినా స్పందన లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్–5 మంచినీటి విభాగాధికారులు పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఏడాది పాలన
అంతులేని వేదన

పాలనకు ఏడాది..
అభివృద్ధి జాడేది?

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయింది. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు మాత్రం అలానే ఉన్నాయి. కనీసం పరిష్కారం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చివరి దశలో ఉన్న వాటిని సైతం పూర్తి చేయక పోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. టిడ్కో ఇళ్లకు సంబంధించి దాదాపు పూర్తికావచ్చినా మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. నియోజకవర్గంలో టిడ్కోఇళ్లు, ఇంటి పట్టాలు, రైల్వే స్థలాల్లో ఉన్న సమస్యలు ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. ఏడాది పాలనలో ఏం సాధించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

– గోపాలపట్నం

- పరిష్కారం కాని సమస్యలు
- ఇంకా దక్కని టిడ్కోఇళ్లు
- సమస్యలు పేరు చెప్పి కాలయాపన

పద్మనాభనగర్‌లో ..	
300 చదరపు అడుగుల ఇళ్లు	48
365 చదరపు అడుగుల ఇళ్లు	336
430 చదరపు అడుగుల ఇళ్లు	432



కంపరపాలెం పద్మనాభనగర్ వ్యూ



పద్మనాభనగర్‌లో టిడ్కో ఇళ్లు

టిడ్కో ఇళ్లు అందని ద్రాక్షలా మారాయని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సామహిక సత్యనారాయణ వ్రతాలు చేయించారు. దాదాపు పనులు పూర్తి చేశారు. తాళాలు అందుకున్న సమయంలో ప్రభుత్వం మారడంతో వారికి కష్టాలు మొదలయ్యాయి. కనీస వసతులు కల్పించక పోవడంతో ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కానీ కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో తమ సొంతింటి కల నెరవేరక పోగా... మరో వైపు బ్యాంకర్లు రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇక్కడ ఇల్లు లేదు.. బయట అద్దెలు చెల్లించక లేక సతమతమవుతున్నారు.వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మేహాద్రి గెడ్డ నిర్వాసితుల సమస్య పట్టదా?

తమకు అవకాశం ఇస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన నాయకులు వాటి సంగతి మర్చిపోయారు. అదే కోవకు చెందుతుంది మేహాద్రి గెడ్డ నిర్వాసితుల పరిస్థితి. మేహాద్రి గెడ్డ నిర్మాణానికి పద్మనాభ నగర్ వాసులు 1975లో, కంపరపాలెం గ్రామస్తులు 1982లో తమ ఇళ్లు, భూములు ఇచ్చారు. వారికి సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో పద్మనాభనగర్ వాసులకు 76, 76ఏ సర్వే నంబర్లలో 308 పట్టాలు, కంపరపాలెం వాసులకు 70, 71, 73 సర్వే నంబర్లలో 215 ఇళ్ల పట్టాలు ఇచ్చారు. 1985లోగృహ నిర్మాణ సంస్థ వద్ద రుణం పొంది ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. మొత్తంగా 523 మందికి పట్టాలు అందించారు.

పేదలకు కూడా..

ఎస్సీబీసీ కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఈ పట్టాలు కూడా లబ్ధిదారులు అవసరాలకు ఉపయోగపడని విధంగా ఉన్నాయి. వారసులు బదిలీ చేసుకునేందుకు కూడా వీల్లేదు. దీంతో కుటుంబ అవసరాలకు తనఖా పెట్టు కోవాలన్నా.., అమ్ముకోవాలన్నా వీల్లేకుండా పోయిందని వాపోతున్నారు. 40 ఏళ్లు అవుతున్నా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టాలు, తాతలు తండ్రుల పేరిట ఉండడం వల్ల వారసులు తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీల్లేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. తమకు గత ప్రభుత్వంలో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా ఇక్కడి సమస్యను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశాలు వచ్చాయి...ఎన్నికలు కారణంగా ఇది వాయిదా పడింది. నాయకులు, అధికారులు దీనిపై దృష్టి పడితే పరిష్కారమవుతుందని కోరుతున్నారు.

కల నెరవేరేనా



నిరుపేదల సొంతింటి కల ఈ ఏడాదైనా నెరవేరుతుందో లేదో. ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా ఎలాంటి కేటాయింపులు చేయలేదు. అర్హులకు ఇంటి తాళాలు అందించినా వారు ఆ ఇంట్లో నివాసం ఉండలేని పరిస్థితి ఉంది. కూటమి పాలకులు స్పందించి వారికి న్యాయం చేయాలి. – బాలు మహేంద్ర, మల్కాపురం ప్రాంత వాసి

హక్కులు కల్పించాలి



మేహాద్రి గెడ్డ కోసం మా ఇళ్లు, భూములు ఇచ్చాము. మాకు ఇళ్లు నిర్మించుకునేందుకు మాత్రమే స్థలాలు ఇచ్చారు. వాటిపై పూర్తి హక్కులు కల్పించాలని దశాబ్దాలుగా కోరుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో పరిష్కారం దిశగా అడుగులు పడినా ఎన్నికల వల్ల మధ్యలోనే నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించాలి.

– కంపర రామకృష్ణ, కంపరపాలెం

అర్హులకు ఇళ్లు అందించాలి



గత ప్రభుత్వం అర్హులైన వారికి ములగాడ ,అచ్చినాయుడులోవలో టిడ్కో ఇళ్లు కేటాయించింది. ఇంతలో ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారింది. మౌలిక వసతులు కల్పించ లేదు. దీంతో వారు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి.కూటమి పెద్దలు సమస్యపై దృష్టి పెట్టి సౌకర్యాలు కల్పించి.. మిగిలినవి లబ్ధిదారులకు అప్పగించాలి.

– రేవళ్ల సత్యనారాయణ, 59వ వార్డు

రైల్వే సమస్యల పరిష్కారంపై కానరాని శ్రద్ధ

నియోజకవర్గంలోని 56, 57, 52, 90, 91, 92 89 వార్డుల్లో రైల్వే సమస్యలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో 89వ వార్డు 91వ వార్డు పరిధిలో తీవ్ర సమస్యగా ఉన్న అండర్‌పాస్‌వే పనులు జరగడంతో ఈ ప్రాంత వాసులంతా సంతోషించారు. అయితే 57వ వార్డు దుర్గాపురం, 56వ వార్డు ప్రాంతాల్లో రైల్వే సమస్యలు ఉన్నాయి. ఇక్కడ అండర్‌పాస్‌వేలు.. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆయా ప్రాంత వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన దుర్గానగర్ ప్రాంతం

నెరవేరని సొంతింటి కల

మల్కాపురం: కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయింది.అయినా పేద వాడి సొంతింటి కల నెరవేర లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మాణంలో ఇళ్లను అర్హులందరికీ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ప్రజలను నమ్మించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పించుకుతిరుగుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 58వ వార్డు ములగాడ ప్రాంతంలో 336 టిడ్కో ఇళ్లు పూర్తయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన వారికి ఇళ్లు కేటాయించగా చాలా మంది గృహప్రవేశాలు కూడా చేశారు. ఇంతలో ప్రభుత్వం మారడం.. నాడు ఇళ్లు పొందిన వారిలో కొంత మంది అనర్హులు అని కూటమి నాయకులు మెలిక పెట్టడంతో ఆ గృహసముదాయాలు అలాగే ఉండిపోయాయి.

- జీవీఎంసీ 62వ వార్డు అచ్చినాయుడులోవ కొండ ప్రాంతంలో సుమారు 4 వేల టిడ్కో గృహాలు పూర్తయ్యాయి. వీటిలో సుమారు రెండు వేల మంది వరకు నాటి ప్రభుత్వం ఇంటి తాళాలను అందించగా, వారు గృహప్రవేశాలు కూడ చేసుకున్నారు.

మిగిలిన ఇళ్ల పత్రాల్లో మార్పులు చేర్పులు,బయోమెట్రిక్ మిషన్‌లో వారి వేలు ముద్రలు సరిపోకపోవడం వంటి పలు సమస్యల వల్ల కేటాయింపులు నిలిచిపోయాయి. అయితే గడిచిన ఎన్నికల్లో కూటమి నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారికి ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి అమలు చేయక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.



ములగాడలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం

నడక వంతెన పనులు వేగవంతం



చంద్రనగర్ వెళ్లే అండర్ పాస్‌వే వద్ద వేస్తున్న రూఫ్



చురుగ్గా సాగుతున్న నడక వంతెన పనులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో నడక వంతెన పనులు వేగవంతం చేస్తున్నారు. గోపాలపట్నం నుంచి చంద్రనగర్‌కు వెళ్లేందుకు ఉన్న పాత వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన వంతెన నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇది పూర్తయిన తర్వాత పాత వంతెన తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.

అండర్ పాస్‌వే వద్ద రూఫ్

చంద్రనగర్‌కు వెళ్లే అండర్‌పాస్‌వే వద్ద వర్షం వల్ల ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూఫ్ వేస్తున్నారు. ఈ పనులు వేగవంతం చేయాలని స్థానికులు వాపోతున్నారు. వర్షా కాలం నేపథ్యంలో రూఫ్ పనులు త్వరితిగతిన చేపట్టాలని కోరుతున్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

మల్కాపురం: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. 61వ వార్డు వెంకన్నపాలెం సీఐటీయూ కార్యాలయం వద్ద కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు నష్టం కలిగించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలలో మార్పులను తీసుకు వచ్చి, వారికి ప్రశ్నించే హక్కు లేకుండా చేస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడం, పలు పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి లేకుండా చేయడం వంటి చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. దీనికి మన రాష్ట్రంలో కూటమి నాయకులు అండగా నిలవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వీరు మారరు!



హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువత



హెల్మెట్ లేకుండా ప్రయాణం

మల్కాపురం: సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు నిరంతరం చెబుతూనే ఉన్నా, ఇంకా కొందరు పట్టించుకోవడం లేదు. ప్రతి వాహనచోదకుడు, వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా మల్కాపురం ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని డాక్‌యార్డ్, సింధియా, మల్కాపురం, నౌసేనా బాగ్, ఆర్‌కే పురం, శ్రీహరిపురం, కోరమాండల్ వంటి ప్రధాన కూడళ్లతో పాటు మిగిలిన ప్రాంతాల్లోనూ అవగాహన కల్పిస్తున్నారు. అయినా ఇవేవీ పట్టించుకోకుండా కొందరు ఇప్పటికీ హెల్మెట్ లేకుండానే ప్రయాణిస్తున్నారు.


కార్పొరేటర్లు లేకుండానే శంకుస్థాపనలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం ఉదయం జరిగిన అభివృద్ధి పనులకు ఆయా వార్డుల కార్పొరేటర్లు లేకుండానే అక్కడి కూటమి నాయకులు కొబ్బరికాయలను కొట్టేశారు. ఓట్లు వేసి గెలిపించిన కార్పొరేటర్లు లేకుండా ఇదేం పని అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కార్పొరేటర్‌కు సమాచారమైనా లేకుండా..

58వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు వార్డు టీడీపీ, జనసేన నాయకులు కలిసి భూమి పూజ చేశారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య అందుబాటులో ఉన్నా ఆమెకు కనీస సమాచారం లేకుండా జీవీఎంసీ వర్క్స్ అధికారులు కూటమి నాయకులకు కొబ్బరికాయ కొట్టే బాధ్యతలను అప్పగించారు. 59తో పాటు మిగిలిన వార్డులలోనూ ఇదే తంతు సాగింది.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



దాబాగార్డెన్స్: ఇసుక కొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. వేకువజాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మరిడిమాంబ పండగకు వేళాయె



సింధియా: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన సింధియా మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పటి నుంచి ఏటా అమ్మవారి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గురువారం అమ్మవారి ప్రధాన పండగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

4 నుంచి ఉత్సవాలు మొదలు

ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి.

4 ఉత్సవ చాటింపు, 5 పుట్ట బంగారం తీసుకువచ్చారు. ప్రతి రోజు అమ్మవారికి దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురువారం పండగ ముగింపు మహోత్సవంలో భాగంగా అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్ , యోగాసనాలు వేస్తున్న నాయకులు

మల్కాపురం: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. జింక్ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో బుధవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిబిరంలో మాధవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుత ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా నగరంలో ఆర్‌కే బీచ్ నుంచి భీమిలిపట్నం మార్గం వరకు సుమారు 27 కిలో మీటర్ల దూరంలో దాదాపు 5 లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలనే సంకల్పం ఉందన్నారు. కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని చెప్పారు. పెద్ద ఎత్తున జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు తప్పక హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలిమేర శ్రీనివాస్,కొక్కిలిగడ్డ విజయబాబు,లక్కరాజు రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్, ఏఈ అర్చన

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం రైల్వే ట్రాక్ రహదారిలో విద్యుత్ స్తంభాలు, దీపాల ఏర్పాటుకు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, జోన్–5 విద్యుత్ లైట్ల విభాగం ఏఈ అర్చన బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.10లక్షలతో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ అర్చన తెలిపారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు మళ్ల రామ్‌ప్రసాద్, మళ్ల శంకరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.